క్లుప్తంగా

కుష్ఠుపై అవగాహన అవసరం

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా కుష్ఠు వ్యాధిపై ఆరోగ్య సిబ్బంది గురువారం అవగాహన కల్పించారు. పొనుగుపాడులో నుదురుపాడు పీహెచ్‌సీ వైద్యురాలు యానీగ్రేస్ పాల్గొని మాట్లాడారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి రాగి రంగు మచ్చలను గుర్తిస్తున్నట్లు తెలిపారు. కుష్ఠు లక్షణాలను నమోదు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతిరోజు 25 కుటుంబాల ఆరోగ్యపరమైన పూర్తి వివరాలు ఎల్‌సీడీసీ ప్రోగ్రాంలో భాగంగా నమోదు చేస్తున్నట్లు చెప్పారు. కుష్ఠు రహిత ప్రతిజ్ఞ సిబ్బందితో చేయించారు. కె.సుదర్శనరాజు, జ్యోతి, ఏఎన్‌ఎంలు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

57వ రోజుకు కార్మికుల దీక్ష

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారానికి 57వ రోజుకు చేరుకున్నాయి. కార్మిక పోరాట సాధన కన్వీనర్ కూరపాటి స్టీవెన్ కార్మికులకు మద్దతు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏసీసీ కార్మికుల న్యాయమైన సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీక్షలో సంఘీభావంగా కె.ఆదినారాయణ, బి.అంకయ్య, సాంబశివరావు, వై.యెహోషువా, కోటేశ్వరరావు, సుబ్బారావు, సూరిబాబు పాల్గొన్నారు.

మంగళగిరి- తెనాలి రోడ్డులో ట్రాఫిక్ జామ్



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తెనాలి రహదారిలో గురువారం భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. తెల్లవారుజామున దుగ్గిరాల ఈమని లాకుల వద్ద ఓ భారీ లారీ టైర్లు పగిలిపోవడంతో రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. ఉదయం నుంచి నెమ్మదిగా ట్రాఫిక్ ఆగుతూ మధ్యాహ్నం సమయానికి దుగ్గిరాల లాకుల దగ్గర నుంచి తెనాలి రోడ్డులో నంది వెలుగు వరకు, మంగళగిరి వైపు రేవేంద్రపాడు వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. ఆ రహదారిలో ప్రయాణిచేవారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆ రహదారిలో ఒక వైపు కాలువ, మరోవైపు పంట పొలాలు ఉండడంతో కనీసం మంచినీళ్లు కూడా లభించలేదని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు.

కోరమండల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని కృష్ణాకెనాల్ రైల్వే గోడౌన్ వద్ద కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. హమాలీల కార్మికులు, వారి కుటుంబ ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ఇఎస్ఐ, రమేష్ హాస్పిటల్, సెంటర్ ఫర్ సైట్ హాస్పిటల్ సహకారంతో ఈ వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోరమండల్ జనరల్ మేనేజర్ శ్రీనివాసవర్మ, రీజనల్ బిజినెస్ హెడ్ చక్రవర్తి, డిజిఎం సత్యానందరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

యూనివర్సల్ కళాశాలలో రక్తదాన శిబిరం

మేడికొండూరు: మండల పరిధిలోని డోకిపర్రు గ్రామ సమీపంలో ఉన్న యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం కన్నెగంటి ఫౌండేషన్ (రెయిన్‌బో రక్తదాన శిబిరం) ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ పామిశెట్టి బాలస్వామి మాట్లాడుతూ ప్రతి మనిషి మరొక మనిషికి ఇవ్వగలిగే అమూల్యమైన దానాలలో రక్తదానం చాలా విలువైనదన్నారు. కళాశాల ప్రిన్సిపల్ కోటిరెడ్డి రక్తదానం చేసి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారు. కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ అనిల్ కుమార్, రెయిన్‌బో రక్తదాన శిబిరం నుంచి నవీన్, కళాశాల పీవో రమేష్, ఫిజికల్ డైరెక్టర్ మర్రెడ్డి, కళాశాల వివిధ విభాగాధిపతుల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

అద్దె భవనాల్లోనే అంగన్‌వాడీ కేంద్రాలు

- 238 కేంద్రాలకు 104 సొంత భవనాలు
- అరకొర సౌకర్యాలతో అద్దె భవనాలు
- ఇరుకు గదుల్లో చిన్నారులకు చదువు దూరం
- వేధిస్తున్న మరుగుదొడ్లు, తాగునీటి కొరత



మంగళగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం

తాడేపల్లి రూరల్: మంగళగిరి నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. శిశు సంరక్షణలో భాగంగా ఆరేళ్ల వయసు ఉన్న చిన్నారులకు ఆటపాటలతో విద్యను అందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశాయి. కానీ కొన్ని ప్రాంతాల్లో అద్దె గదుల్లో నడుస్తున్న కేంద్రాల్లో సరైన వసతులు లేక చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్దాలు గడుస్తున్నా అంగన్‌వాడీ కేంద్రాలు సొంత భవనాలకు నోచుకోవడం లేదు. పలు కేంద్రాలు అప్పుడప్పుడు మారుతుండడంతో నిర్వాహకులు, చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాల నిర్మాణంపై ఏ ప్రభుత్వం కూడా దృష్టి సారించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మంగళగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో..

మంగళగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండలాల్లో మొత్తం 238 కేంద్రాలు ఉన్నాయి. అందులో సొంత భవనాలు 104, అద్దె భవనాలు 116 ఉండగా.. ఉచిత భవనాలు 18 ఉన్నాయి. మూడు మండలాల్లో మొత్తం గర్భిణీలు 1,488 మంది, బాలింతలు 1,647 మంది ఉన్నారు. ఆరేళ్ల లోపు చిన్నారులు 8,661 మంది ఉన్నారు. దాదాపు చాలా కేంద్రాల్లో చిన్నారులకు తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. చిన్న అద్దె గదుల్లోనే చిన్నారులకు విద్యను అందించడం, వంట సామగ్రిని భద్రపరచడం, వంట వండడం, పాలు, గుడ్లు ఇతర పౌష్టికాహారం ఉంచడం వంటి పనులన్నీ ఒకేచోట నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో అద్దె గదుల్లో నిర్వహిస్తున్న కేంద్రాలకు పిల్లలను పంపడానికి, గర్భిణీలు వెళ్లడానికి నిరాశక్తత చూపుతున్నారు. పలుచోట్ల విద్యుత్ సదుపాయం లేక ఉక్కపోతతో పిల్లలు అవస్థ పడుతున్నారు.

మరుగుదొడ్లు, తాగునీరు మంజూరు

మంగళగిరి ఐసీడీఎస్ పరిధిలోని 61 కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వం అందించే సక్షం పథకం ద్వారా తాగునీరు, మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలకు నిధులు మంజూరు అయ్యాయి. వీటితో పాటు ప్రీస్కూల్ మెటీరియల్, పోషణ వాటిక కూడా నిధులు మంజూరయ్యాయి.

సౌకర్యాలు కల్పిస్తాం



చిన్నారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ నిధులతో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాన్ని 61 కేంద్రాలకు కల్పించాం. పోషణ వాటిక ద్వారా 61 కేంద్రాలకు ఒక్కొక్క కేంద్రానికి రూ.10 వేల చొప్పున మంజూరు అయ్యాయి. పిల్లలకు అన్ని సౌకర్యాలు చూసే అద్దెకు భవనాలు తీసుకుంటున్నాం.

– ఎ. సులోచన, సీడీపీఓ, మంగళగిరి

అప్పుల రాజధాని మాకొద్దు.. ప్రజా రాజధాని కావాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాబురావు



రాష్ట్ర మహాసభల వాహనాన్ని ప్రారంభిస్తున్న బాబురావు

తాడేపల్లిరూరల్ : ఆంధ్రప్రదేశ్‌కు అప్పుల రాజధాని వద్దని, ప్రజారాజధాని కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చిగురుపాటి బాబురావు అన్నారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని నెహ్రూబొమ్మ సెంటర్‌లో నెల్లూరులో జరిగే సీపీఎం మహా సభలకు సంబంధించి ప్రచార జాతను ఆయన ప్రారంభించారు. ముఖ్య అతిథి సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చిగురుపాటి బాబూరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కావస్తున్నా రాష్ట్రం కోసం రూ.1,500 కోట్లు మాత్రమే కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందన్నారు. నూతన రాజధాని కోసం గ్రాంటుగా ఇవ్వాల్సిన నిధులను అప్పుగా ఇచ్చి, రాష్ట్ర ప్రజలను నరేంద్రమోదీ ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. సీపీఎం మహా సభల సందర్భంగా రాష్ట్రంలో మూడు ప్రాంతాల నుంచి ప్రజాయాత్రను చేస్తోందని అన్నారు. ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో నెల్లూరులో జరిగే 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.రవి, ఈమని అప్పారావు, బూరుగ వెంకటేశ్వరరావు, పాశం రామారావు, దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, జొన్న శివశంకరరావు పాల్గొన్నారు.

దొంతిరెడ్డికి సన్మానం

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డిని ఆ పార్టీ నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. తాడేపల్లికి చెందిన మాజీ కౌన్సిలర్ ఈదులమూడి డేవిడ్‌రాజు జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. డేవిడ్‌రాజు, తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, తాడేపల్లి రూరల్ మాజీ అధ్యక్షుడు పాటిబండ్ల కృష్ణమూర్తి తదితరులు వేమారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సత్కరించారు.

కూరగాయల వ్యాపారి ఆత్మహత్యా యత్నం



పురుగు మందు తాగిన చిన్న అంజి

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లి గ్రామానికి చెందిన కూరగాయల వ్యాపారి అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్యా యత్నం చేశాడు. ఈ ఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం.. ఉండవల్లికి చెందిన చిన్న అంజి గత 15 సంవత్సరాల నుంచి కూరగాయల వ్యాపారం చేస్తూ జీవిస్తున్నారు. వ్యాపార నిమిత్తం అప్పులు చేసి ఆ అప్పులు తీర్చలేక, అప్పు ఇచ్చిన వారు ఒత్తిడి చేయడంతో తట్టుకోలేక బుధవారం ఉండవల్లి పంట పొలాల్లో ఆత్మహత్య చేసుకుంటూ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. తనను వేధిస్తున్న హరీష్, మొగలి పువ్వు మణి, జొన్నకూటి ప్రసాద్, యర్రబాలెం కొట్టులో ఉండే ప్రేమ్ కారణమని, తాను చేసిన అప్పులకు తన భార్యకు ఎటువంటి సంబంధం లేదని, తన భార్యను కాపాడాలని చెప్పుకొచ్చాడు. ఆ వీడియోను తన స్నేహితులకు పంపడంతో వెంటనే వారు ఆచూకి కనుక్కొని వైద్యం నిమిత్తం మంగళగిరిలోని ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అంజి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు. జరిగిన ఈ ఘటనపై ఇప్పటి వరకు కుటుంబ సభ్యులు ఎటువంటి వివరాలు తెలియజేయలేదు.

మహాత్మా గాంధీకి ఘన నివాళులు



నివాళులర్పిస్తున్న సమన్వయకర్త దొంతిరెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు

తాడేపల్లి రూరల్ : మహాత్మా గాంధీ వర్ధంతి మంగళగిరిలోని ఆత్మకూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుంటూరు జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి దామర్ల కుబేరస్వామి, యాక్టివ్ కార్యదర్శి మల్లవరపు సుధారాణి, మంగళగిరి తాడేపల్లి పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, నాయకులు నాళి వెంకటేశ్వరరావు, వడ్డేశ్వరపు రజనీకాంత్, షేక్ సుభాని, పాటిబండ్ల కృష్ణమూర్తి, ధనుంజయ్, నాగిరెడ్డి, సుబ్బారావు, సురేష్ పాల్గొన్నారు. అలాగే టీడీపీ నాయకులు, కార్యకర్తలు గాంధీ వర్ధంతి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో నాయకులు పోతినేని శ్రీనివాసరావు, నందం అబద్ధయ్య, జానకిదేవి, తాడేపల్లి పట్టణ రూరల్ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు, అమరా సుబ్బారావు పాల్గొన్నారు.

రాజధానిలో దళితుడిపై టీడీపీ నేత దాష్టీకం



తన స్థలంలో ఫెన్సింగ్ ధ్వంసం చేశారని చూపిస్తున్న దళిత రైతు పేరం భాస్కరరావు

తాడికొండ: నమ్మించి తన స్థలాన్ని రిజిస్ట్రేషన్‌తో సొంతం చేసుకొని మోసం చేయడంతో కోర్టుకెళ్లి ఇంజెక్షన్ తెచ్చుకొని ఫెన్సింగ్ వేసి బోర్డు పాతిన దళిత రైతుపై దాడికి పాల్పడి బెదిరించిన ఘటన తుళ్లూరులో జరిగింది. బాధితుడు వివరాల మేరకు.. తుళ్లూరుకు చెందిన పేరం భాస్కరరావు అనే దళిత రైతు అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు దామినేని వీరేంద్ర వద్ద రూ.5 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఇందుకు గాను వడ్డీపై వడ్డీ వేయడంతో రూ.14 లక్షలకు చేరింది. తనఖా రిజిస్ట్రేషన్ అని చెప్పి నమ్మకంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని బాధితుడు వాపోయాడు. వడ్డీతో సహా నగదు చెల్లిస్తే నీ స్థలం నీకు అప్పగిస్తానని చెప్పి మొదట్లో చెప్పిన సదరు టీడీపీ నాయకుడు, వడ్డీ వ్యాపారి నగదు మొత్తం చెల్లించినప్పటికీ తిరిగి రిజిస్ట్రేషన్ చేయకుండా ఇబ్బందులకు గురిచేయడంతో.. బాధితుడు పేరం భాస్కరరావు తాను నగదు తీసుకొని తిరిగి చెల్లించిన నోట్లు, చెక్కులతో పాటు ఇతర అధారాలతో మంగళగిరి కోర్టును ఆశ్రయించాడు. కోర్టు ఆ స్థలంపై స్టే విధిస్తూ ఇంజక్షన్ ఆర్డరు జారీ చేసింది. కోర్టు ఆర్డరుతో బాధితుడు తన స్థలంలో ఫెన్సింగ్ వేసి బోర్డు పాతాడు. బుధవారం సాయంత్రం పేరం భాస్కరరావు తన స్థలాన్ని చదును చేసుకుంటుండగా వచ్చిన దామినేని వీరేంద్రతో పాటు అతని తండ్రి శ్రీనివాసరావు అలియాస్ బెంజిమెన్, దామినేని సురేంద్ర అతని అనుచరులతో దాడిచేసి ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసి కులం పేరుతో దూషించి కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బాధితుడు పేరం భాస్కరరావు తనకు జరిగిన అన్యాయం, దాడిపై తుళ్ళూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గర్భకోశ వ్యాధులకు చికిత్స

ఫిరంగిపురం: మండలంలోని బేతపూడి గ్రామంలో గురువారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. పశు వైద్యాధికారి పీర్ అహ్మద్ 140 గేదెలు, 80 దూడలకు డీవార్మింగ్ మందు వేసినట్లు తెలిపారు. 18 గేదెలకు గర్భకోశ వ్యాధులకు, 23 గేదెలకు సూడి, 27 గేదెలకు సాధారణ జబ్బులకు పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు పేర్కొన్నారు. 300 జీవాలకు షీప్ వ్యాక్సిన్ వేసామని వెల్లడించారు. పశు వైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

10న దివ్యాంగ ఉపకరణాల మంజూరుకు శిబిరం

ఫిరంగిపురం: దారిద్ర్యరేఖ దిగువన ఉన్న దివ్యాంగులు, వయోవృద్ధులకు ఉపకరణాలు, సహాయక పరికరాల ఉచిత పంపిణీ కోసం తాడికొండలో వచ్చే నెల 10న అర్హుల గుర్తింపు శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తాడికొండ ఎంపీడీవో కార్యాలయం వద్ద పరీక్షలు చేస్తారని చెప్పారు. రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్, రెండు ఫొటోలు, ఫోన్ నంబరుతో హాజరుకావాలన్నారు. వివరాలకు 98493 47904, 9959 127045 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.



హెల్మెట్ ప్రాధాన్యంపై అవగాహన

బైక్ ర్యాలీ నిర్వహించిన పట్టణ సీఐ వినోద్‌కుమార్

మంగళగిరి (తాడేపల్లి రూరల్) : ఒక సెల్‌ఫోన్ కొంటే దానికి సురక్షితంగా కవర్ వేయించే వ్యక్తి.. తన తలకు విలువ అయ్యే హెల్మెట్ మాత్రం ధరించడం లేదని మంగళగిరి పట్టణ సీఐ వినోద్ కుమార్ అన్నారు. గురువారం నగర పరిధిలో జాతీయ రహదారి భద్రతా మహోత్సవాల్లో భాగంగా హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నగర పరిధిలోని సచివాలయాల మహిళా పోలీస్‌లు, పట్టణ, రూరల్ సిబ్బందితో కలసి బైక్‌లపై హెల్మెట్ ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీ పట్టణ పోలీస్‌స్టేషన్ నుంచి ఆర్ అండ్ బీ బంగ్లా వరకు, అక్కడి నుంచి ఆటోనగర్ వరకు అక్కడి నుంచి తిరిగి పట్టణ స్టేషన్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా సీఐ వినోద్ కుమార్ మాట్లాడుతూ సెల్‌ఫోన్‌కు ఇస్తున్న ప్రాధాన్యం ఈ కాలంలో మనుషులు తన తలకు ఇవ్వడం లేదని అన్నారు. ఈ ర్యాలీలో పట్టణ ఎస్ఐలు హరిబాబు, నాయక్, రైటర్ లక్ష్మీపతిరాజు, క్రైం సిబ్బంది కొండలరావు, బాబూరావు, శ్రీరామ్ , సుధీర్, సచివాలయ మహిళా పోలీసులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నులకపేటలో కార్డన్ సెర్చ్

తాడేపల్లి రూరల్ : అసాంఘిక శక్తులపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తాడేపల్లి సీఐ కల్యాణ్ రాజు తెలిపారు. గురువారం రాత్రి తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేట ప్రాంతంలో పలుచోట్ల ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసిన కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి సోదాలు నిర్వహించారు. 20 మంది వాహనాలకు పత్రాలు చూపించకపోవడంతో వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సరైన పత్రాలు చూపించి వాహనాలను తీసుకు వెళ్లాలని సూచించారు. సెర్చ్‌లో తాడేపల్లి పోలీసులతో పాటు ప్రత్యేక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉండవల్లి రైతులకు ప్యాకేజీ పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న జొన్న శివశంకరరావు

తాడేపల్లిరూరల్ : కొండవీటి వాగు విస్తరణకు భూములు ఇచ్చిన ఉండవల్లి రైతులకు అదనంగా ప్యాకేజీ పెంచాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు డిమాండ్ చేశారు. గురువారం ఉండవల్లిలో కొండవీటి వాగు విస్తరణకు భూములు ఇచ్చిన రైతులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రైతు సంఘం నాయకుడు బుర్రముక్కు పద్మనాభరెడ్డి అధ్యక్షతన శివశంకరరావు మాట్లాడుతూ ఉండవల్లి గ్రామంలో వాగు విస్తరణకు 720 ఎకరాల సమీకరణ అవసరమన్నారు. ఈ ప్రాంతంలో భూములు ఖరీదని, దీంతో ప్రభుత్వం ఇస్తున్న ఎకరాకు 1,450 గజాల స్థలానికి అదనంగా ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. రైతులకు గ్రామంలోనే యువన్ జోన్‌కు కేటాయించిన స్థలంలో లే అవుట్లు వేసి, ప్లాట్లు ఇవ్వాలని అన్నారు. రైతు సంఘం నాయకులు దండమూడి సాంబశివరావు, బక్కిరెడ్డి వీరాస్వామి, జె.రామలింగేశ్వరరావు, దాసరి సాంబశివరావు, బోసిరెడ్డి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా పదవుల్లో మంగళగిరికి ప్రాధాన్యం

వివరాలు వెల్లడించిన ఎమ్మెల్సీ మురుగుడు, సమన్వయకర్త దొంతిరెడ్డి



మాట్లాడుతున్న దొంతిరెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు

తాడేపల్లిరూరల్: వైఎస్సార్ సీపీ పార్టీ జిల్లా పదవులు మంగళగిరి నియోజకవర్గానికి 7 మందికి దక్కాయి. వారి వివరాలను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మంగళగిరి పార్టీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి గురువారం ఆత్మకూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వెల్లడించారు. దొంతిరెడ్డి మాట్లాడుతూ మంగళగిరి రూరల్ మాజీ ఎంపీపీ పచ్చల రత్నకుమారికి జిల్లా ఉపాధ్యక్షురాలిగా, తాడేపల్లికి చెందిన మాజీ కౌన్సిలర్ ఈదులమూడి డేవిడ్ రాజును జిల్లా ప్రధానకార్యదర్శిగా, మంగళగిరికి చెందిన దామర్ల కుబేరస్వామిని జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా, మాజీ కౌన్సిలర్ చింకా గంగాధర్‌కు జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా, మల్లవరపు సుధారాణికి జిల్లా యాక్టివిటీ కార్యదర్శిగా, దుగ్గిరాలకు చెందిన మహమ్మద్ బాజీ షాహిద్‌ను జిల్లా యాక్టివిటీ కార్యదర్శిగా, కాశినీడు బాజీ గంగాధర్‌ను నియోజకవర్గ అధికార ప్రతినిధిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఏడుగురికి పదవులు ఇచ్చినందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులకు, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, దొంతిరెడ్డి వేమారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

గ్యాస్ గోడౌన్‌లో సిలిండర్ లీకేజీ..తప్పిన ముప్పు



లీక్ అవుతున్న గ్యాస్ సిలిండర్

తాడేపల్లి రూరల్ : మంగళగిరి పట్టణ పరిధిలోని ఆటోనగర్‌లో ఉన్న గ్యాస్ కంపెనీలో గురువారం గ్యాల్ లీక్ అయ్యింది. అక్కడ పనిచేస్తున్న సిబ్బంది అప్రమత్తమై లీక్ అవుతున్న గ్యాస్ సిలిండర్‌ను బయటకు తీసుకు వచ్చి లీకేజ్‌ను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. సేకరించిన వివరాల ప్రకారం.. ఆటోనగర్ రాయల్ గ్యాస్ కంపెనీ వద్ద లారీలో నుంచి గ్యాస్ సిలెండర్లను దించిన అనంతరం ఒక గ్యాస్ సిలిండర్ కింద నుంచి లీక్ అయ్యింది. అది గమనించిన సిబ్బంది వెంటనే అప్రమత్తమై లీక్ అవుతున్న సిలెండర్‌ను వేరు చేసి గ్యాస్ లీకేజీను ఆపేందుకు ప్రయత్నించారు. అప్పటికే సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. సిలిండర్ గ్యాస్ మొత్తం పోయిన తరువాత ఊపిరి పీల్చుకున్నారు. గ్యాస్ లీక్ అయిన సమయంలో సుమారు 500 నుంచి 600 వరకు గ్యాస్ సిలెండర్లు ఉన్నట్లు సమాచారం. సిబ్బంది అప్రమత్తత వల్ల పెను ప్రమాదం తప్పినట్లు స్థానికులు తెలిపారు. గ్యాస్ కంపెనీ పరిసరాల్లో ఐటీ కంపెనీలతో పాటు, ఫంక్షన్ హాల్స్, కళ్యాణ మండపాలు, కారు షోరూమ్ ఉండడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన ర్యాలీ

తాడేపల్లి రూరల్ : మంగళగిరి నగరపరిధిలోని ఇందిరానగర్ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం కుష్ఠు నివారణ దినోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ పి. అనూష మాట్లాడుతూ చర్మంపై స్పర్శలేని మచ్చలు, కనురెప్పలు మూతపడకపోవడం, అరచేతులు, అరికాళ్లలో స్పర్శ లేకపోవడం, చేతుల నుండి వస్తువులు, కాళ్ల నుంచి చెప్పులు జారడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లెప్రసీ డిపిఎంవో జోసఫ్, ఎయిమ్స్ సీఎఫ్ఎం డిపార్ట్‌మెంట్ వైద్యులు డాక్టర్ సోహమ్, డాక్టర్ ఉత్కర్ష తివారీ, జేఆర్‌సీఎఫ్ఎం డిపార్ట్‌మెంట్ వైద్యులు హాసిని పాల్గొన్నారు.

తుళ్లూరులో అర్ధరాత్రి కలకలం

రాయపూడి(తాడికొండ): తుళ్లూరు మండలంలో అర్ధరాత్రి దొంగల కలకలం రేగింది. గుర్తు తెలియని యువకులు రాయపూడి సీడ్ యాక్సిస్ రోడ్డు సమీపంలోని ఇళ్ల వద్ద రెండు ద్విచక్ర వాహనాలపై తిరుగుతుండటంతో అనుమానం వచ్చి స్థానికులు వెంటపడ్డారు. దీంతో ఆ యువకులు వాహనాలను వదిలి పరుగు లంకించుకున్నారు. రెండు రోజుల క్రితం రాత్రి వేళ కారు, ద్విచక్ర వాహనం వేసుకొని పలు గ్రామాల్లో వరుస చోరీలకు పాల్పడటంతో అప్రమత్తమైన రాజధాని ప్రాంత జనం బుధవారం రాత్రి యువకులను వెంబడించారు. అయితే సదరు యువకులు వాహనాలు వదిలి వెళ్లి తిరిగి రాకపోవడంతో పోలీసులకు రెండు వాహనాలు అప్పగించారు. ఇది దొంగతనం కోసం వచ్చిన వారివా లేక ఆకతాయి యువకులు రాత్రివేళ ఎవరి కోసమైనా వచ్చారా అనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పెనుమూలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఎస్‌టీయూ ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్. రామచంద్ర్య మాట్లాడుతూ స్టడీ మెటీరియల్‌ను రాష్ట్ర సంఘ అకడమిక్ కమిటీ నిష్ణాతులైన ఉపధ్యాయులతో రూపొందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఉన్నం ప్రసాద్, మునిపల్లి మోహనకృష్ణ, మండల కార్యవర్గ సభ్యులు చిలకా విజయరాజ్, మహమ్మద్ నూరుల్ అన్సారి, పెనుమూలి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

యస్.టి.ఆర్. డిస్ట్రిక్టు, విజయవాడ సిటీ, పాయికాపురం గ్రామస్థులైన లటికా హనుమంతరావు గారి కుమారుడు లటికా శ్రీనివాసరావు సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా... షెడ్యూలు దాఖలా ఆస్థి మరియు యితర అస్థి లటికా కోటమ్మ గారిది. సదరు లటికా కోటమ్మ, అమె ముగ్గురు కుమారులైన లటికా హనుమంతరావు, లటికా ఫిరోజ్, లటికా రామోజీరావు గార్ల పేరిటికి 17-04-1960 సెటిల్‌మెంట్ దస్తావేజు వ్రాసినది. నా క్లయింట్ తండ్రిగారు 1975లో స్వర్గస్థులైనారు. దరిమిలా లటికా ఫిరోజ్, అయన భార్య ఎటువంటి సంతానము లేకుండా స్వర్గస్థులైనారు. లటికా కోటమ్మ గారు 1982లో స్వర్గస్థులైనారు. కోటమ్మ తదనంతరము షెడ్యూలు దాఖలా ఆస్థి మరియు ఇతర అస్థి నా క్లయింటుకున్ను, వారి అక్కగారికిన్నీ, వారి తల్లిగారికి మరియు లటికా రామోజీరావు ఉరఫ్ రాములుకు సంక్రమించి, వార్ల జాయింట్ స్వాధీనములో ఉన్న పరిస్థితులలో, నా క్లయింటు కుమార్తెలైన పోట్నూరి లలిత, దేవూరి ఝాన్సీ, మంగళగిరి సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో షెడ్యూలు ఆస్తులను భాగ పంపిణీ చేసి వారికి వాటా యిప్పించవలసినదిగా O.S.53/2010 దావా దాఖలు చేయగా శ్రీ కోర్టు వారు డిక్రీ యిచ్చినారు. సదరు డిక్రీ జడ్జిమెంటుపై లటికా రామోజీరావు గారు గుంటూరు 5వ జిల్లా కోర్టులో A.S.141/2014 దాఖలు చేయగా శ్రీ జిల్లా కోర్టు వారు నా క్లయింటును, వారి అక్కగారికిన్నీ వారల తల్లిగారికి, లటికా హనుమంతరావు గారి తదనంతరం షెడ్యూలు దాఖల ఆస్థిలోను మరియు ఇతర ఆస్థిలోను జాయింటు సగము ఆస్థి సంక్రమించినదని వారల జాయింటు స్వాధీనంలో ఉన్నదని ఫైండింగు ఇస్తూ నా క్లయింటు కుమార్తెలు 3వ జెనరేషన్ అయినందు వలన పార్టీషన్ దావా పనికిరాదని అప్పీలు ఎలో చేసినారు. కావున లటికా రామోజీరావు గారికి షెడ్యూలు దాఖల ఆస్థినీ, ఇతర ఆస్తులను అన్యాక్రాంతము చేయుటకున్నూ దఖలు పరచుటకున్ను సదరు రామోజీరావు గారికి పూర్తి ట్రాన్స్‌ఫర్ హక్కులు లేవనియు సదరు షెడ్యూల్ దాఖల ఆస్తులను, లటికా వెంకట్రావు గానీ లటికా నాగులుకు గానీ ఎటువంటి హక్కు స్వాధీనము లేదని, ఇందుమూలముగా యావన్మందికీ తెలియపరచటమైనది ఏమనగా ఈ దిగువ షెడ్యూలు ఆస్తులను ఎవరైనా క్రయవిక్రయాలు జరిపినయెడల నా క్లయింటును బైండ్ చేయజాలదని ఇందుమూలముగా యావన్మందికీ తెలియపరచటమైనది.

షెడ్యూల్

ఐటమ్ నెం.1: గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్ డిస్ట్రిక్ట్, తాడేపల్లి మండలము, వడ్డేశ్వరం గ్రామ సర్వే నెం.29/6 లో గల 74 సెంట్ల మాగాణి భూమికి హద్దులు: **తూర్పు :** మట్టి సుబ్రమణ్యం గారి స్థలము హద్దు; **దక్షిణం:** తోటకూర బాలాజి గారి హద్దు; **పడమర :** పీత సత్యనారాయణ; **ఉత్తరం:** తోటకూర వెంకటేశ్వర్లు గారి హద్దు. **పై హద్దుల మధ్య గల 74 సెంట్లు మాగాణి భూమి.**

ఐటమ్ నెం.2: గుంటూరు డిస్ట్రిక్టు, మంగళగిరి సబ్ డిస్ట్రిక్టు, తాడేపల్లి మండలము, వడ్డేశ్వరం గ్రామ సర్వే నెం.24/1 లో గల 30 సెంట్ల మాగాణి భూమికి హద్దులు: **తూర్పు:** మట్టి సుబ్రమణ్యం గారి హద్దు; **దక్షిణం:** గోపు అర్జునరావు గారి హద్దు; **పడమర:** గోపు అర్జునరావు గారి హద్దు; **ఉత్తరం:** తోటకూర బాలాజీ గారి హద్దు. **పై హద్దుల మధ్య గల 30 సెంట్లు మాగాణి భూమి.**

ఐటమ్ నెం.3: గుంటూరు డిస్ట్రిక్టు, మంగళగిరి సబ్ డిస్ట్రిక్టు, తాడేపల్లి మండలము, వడ్డేశ్వరం గ్రామ సర్వే నెం.24/1 లో గల 1 ఎకరం 14 సెంట్ల మాగాణి భూమికి హద్దులు: **తూర్పు :** జూదం రాములు గారి స్థలము హద్దు; **దక్షిణం:** పొలిమేర డొంక; **పడమర :** శంకరశెట్టి పెద్ద వెంకయ్య గారి స్థలము హద్దు; **ఉత్తరం :** లటిక శ్రీనివాసరావు గారి బహుమాన ఆస్థి. **పై హద్దుల మధ్య గల 1 ఎకరం 14 సెంట్ల మాగాణి భూమి.**

ఐటమ్ నెం.4: గుంటూరు డిస్ట్రిక్టు, మంగళగిరి సబ్ డిస్ట్రిక్టు, తాడేపల్లి మండలము, వడ్డేశ్వరం గ్రామ సర్వే నెం.13/1 లో గల 88 సెంట్ల మాగాణి భూమికి హద్దులు: **తూర్పు :** తెన్నేటి నాగేశ్వరమ్మ గారి స్థలము హద్దు; **దక్షిణం:** షేక్ కరిముాన్ బి గారి స్థలము హద్దు; **పడమర :** మదదేశి గోవింద చార్యులు గారి స్థలము హద్దు; **ఉత్తరం :** షేక్ ఖాశీం సాహెబ్ & ఇతరుల స్థలము హద్దు. **పై హద్దుల మధ్య గల 88 సెంట్ల మాగాణి భూమి.**

కల్లంపల్లి స్వాతి, అడ్వకేట్
డో.నెం.39-13-1434, 2వ లైను, నెహ్రూనగర్, గుంటూరు-522001.